క్లుప్తంగా

అయ్యన్న కుటుంబానికి దొరబాబు పరామర్శ



అయ్యన్నను పరామర్శిస్తున్న దవులూరి దొరబాబు

పెద్దాపురం: కొండపల్లి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు కేశారపు అయ్యన్న కుటుంబాన్ని సోమవారం పార్టీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు పరామర్శించారు. ఇటీవల ఆయన పిన్ని లక్ష్మి మృతి చెందడంపై ఆమె మృతిపై సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, కొండపల్లి గ్రామ సర్పంచ్ కొత్త చక్రకరావు, పోకనాటి దుర్గారావు తదితరులున్నారు.

పంచాయతీ చెరువు గట్టుపై మొక్కలు నాటే కార్యక్రమం



మాధవపట్నంలో మామిడి, కొబ్బరి మొక్కలు నాటిన సర్పంచ్ సుగుణమ్మ తదితరులు

సామర్లకోట: మాధవపట్నం పంచాయతీ నిధులతో ఆ గ్రామ చెరువు గట్టుపై ఫలసాయం ఇచ్చే మొక్కలను నాటారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలలో మొక్కలు నాటడం వల్ల అవి చిగురించే అవకాశం ఉందన్నారు. నీడ కోసమే కాకుండా ఫల సహాయం ఇచ్చే మొక్కలు వేయడం వల్ల పంచాయతీకి ఆదాయం వస్తుందనే లక్ష్యంతో కొబ్బరి, మామిడి మొక్కలను పంచాయతీ చెరువు గట్టుపై వేశామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, పంచాయతీ వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణలు పాల్గొన్నారు.

విశిష్ట పురస్కారం అందుకున్న పద్మజ రామచంద్రమూర్తి దంపతులు



పురస్కారాన్ని అందుకుంటున్న రామచంద్రమూర్తి, పద్మజ దంపతులు

కొత్తపల్లి: అంతర్జాతీయ గుర్తింపు పొందిన మదర్ సర్వీస్ సేవా సంస్థ మూడో వార్షికోత్సవం సందర్భంగా విజయవాడలో ఉన్న అక్కినేని నాగేశ్వరావు కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని కొత్తపల్లి బాలుర పాఠశాలలో పని చేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయురాలు యాళ్ల పద్మజ, మూలపేట జిల్లా పరిషత్ గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నల్లం అచ్యుత రామచంద్రమూర్తి దంపతులకు ప్రముఖ సినీ నటుడు పృథ్వీరాజ్, కుమారీ రజిత షాండే చేతుల మీదుగా విశిష్ట పురస్కారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కర్నాటక, ఒడిశా, ఢిల్లీ రాష్ట్రాలలో వివిధ రంగాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న వారిని శాలువాలతో, పురస్కారాలతో సత్కరించారు. పురస్కారం పొందిన రామచంద్రమూర్తి దంపతులను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. సోమవారం స్వామి వారికి ప్రీతైన రోజు, నవమి కావడంతో ఆలయంలోని కుమార రామభీమేశ్వర స్వామివారికి, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉప ఆలయాలోను అర్చకులు పూజలు చేశారు. తెల్లవారు జాము నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరిణిలోని నీటితో స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. భక్తులకు ఉదయం పులిహోర, మధ్యాహ్న అన్నప్రసాదం, సాయంత్రం శనగలు, పులిహోర ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లాకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా స్థానిక మఠంసెంటర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయంలోను, గొంచాలలో వేంచేసి యున్న శివాలయంలోను, పీబీ దేవం శివాలయంలోను పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

కర్షకుడికి కష్టాలు

- యూరియా కోసం రైతుల తిప్పలు
- కార్యాలయాల వద్ద పడిగాపులు
- ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని ప్రభుత్వం



యూరియా కోసం చేబ్రోలులో రోడ్డెక్కిన రైతులు

పిఠాపురం: చీటీ ఉంటేనే యూరియా బస్తా ఇస్తున్నారు. కూపన్ల కోసం రైతులు గంటల తరబడి వ్యవసాయ శాఖాధికారుల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. కూపన్ ఇచ్చాకా యూరియా తీసుకోడానికి మరో రోజు వృథా అవుతోంది. ఇదీ రైతన్న పరిస్థితి. కూపన్, ఎరువులు ఇవ్వడానికి పోలీసు బందోబస్తు నడుమ రైతులు క్యూలో పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో సుమారు 37 వేల ఎకరాలలో రైతులు వరిని పండించనున్నారు. అయితే వర్షాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు కాలువల్లో పూర్తిస్థాయిలో ఆధునీకరణ పనులు జరగలేదు. ప్రాజెక్టుల్లో కూడా తగినన్ని నీటి నిల్వలు లేవు. దాంతో సాగు నీరు అందని దుస్థితిలో అన్నదాతలు అష్ట కష్టాలు పడుతున్నారు. ఒక పక్క సాగునీటి కష్టాలు వెంటాడుతుండగా వాటి నుంచి వర్షాల వల్ల బయటపడగా మరోవైపు ఎరువుల ఇబ్బందులు అన్నదాతలను అయోమయానికి గురిచేస్తున్నాయి.

ఎరువుల కోసం ప్రదక్షిణలు

నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌కు 4,175 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు 3037.55 మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధం చేసినట్లు దానిని దశల వారీగా రైతులకు సరఫరా చేసినట్లుగా అధికారులు చెబుతున్నారు. అవసరమైనంత అందుబాటులో ఉన్నట్టు అధికారులు మొదటి నుంచీ వాదిస్తూ వస్తున్నారు. కాని రైతులు మాత్రం యూరియా కోసం ప్రతి రోజు రోడ్డెక్కె పరిస్థితి నెలకొంది. ఎరువులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నా అవి రైతులకు సక్రమంగా అందడంలేదు. అంతేకాకుండా ఎరువుల కోసం రైతులు పీఏసీఏలు, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు కావలసిన ఎరువులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో సరఫరా చేయలేక పోతుందంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేట్ డీలర్లు వాస్తవానికి రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. సొసైటీలు, ప్రైవేటు డీలర్ల వద్దకు క్యూ కడుతున్నారు. గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. అయినా సరే యూరియా కావలసినంత అందుబాటులో లేకపోవడం గమనార్హం. కొన్నిచోట్ల నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. దాంతో పంటల దిగుబడిపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పంట ఆశించిన స్థాయిలో ఎదుగుదల ఉండాలంటే యూరియా తప్పనిసరిగా వేయాల్సి ఉంటుంది. దీంతో ఎలాగైనా తమ పంటలకు యూరియాను వేయాలనే ఆశతో రైతులు కాళ్లు అరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కొన్నిచోట్ల అధికార పార్టీ నేతల సిఫార్సులు పొందిన వారికి మాత్రం యూరియా సక్రమంగానే అందుతుంది. మిగిలిన సాధారణ రైతాంగానికి అందడంలేదు. గంటల తరబడి వేచి ఉంటున్నా ప్రైవేటు డీలర్లు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. యూరియా కావాలంటే గుళికలు, ఇతర పురుగు మందులు కొనుగోలు చేయాలనే లింకు పెడుతున్నారు. ప్రస్తుతం తమకు పురుగుల మందులు అవసరం లేవని యూరియా మాత్రం ఇవ్వాల్సిందిగా వేడుకుంటున్నా డీలర్లు పట్టించుకోవడం లేదు. అధికారులకు ఫిర్యాదులు అందుతున్నప్పటికీ డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తమపై అదనపు భారం పడుతుందని, ఇప్పటికే అప్పులు చేసి పెట్టుబడులు పెడుతుండగా అవసరం లేని మందులు ఎలా కొనుగోలు చేస్తామంటూ పలువురు రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

అన్నదాతను అవమానిస్తున్నారు



ప్రభుత్వం రైతులను ఇబ్బందుల పాలుచేస్తోంది. అన్నదాతను అవమానిస్తోంది. యూరియా కోసం క్యూలైన్లో నిలబడితే సినిమా టిక్కెట్లతో పోల్చుతూ హేళన చేస్తోంది. ఓ సందర్భంలో పిఠాపురం టీడీపీ నేత వర్మ మాట్లాడుతూ పార్టీ నేతల దగ్గరకు వెళ్లి వరుసలో నించోరా సినిమా టిక్కెట్ల కోసం వెళ్లి క్యూలో నుంచోరా అంటు రైతులను అవహేళన చేయడం చూస్తుంటే రైతులపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుంది. అవసరమైనంత యూరియా ఇవ్వక పోవడం వల్లే రైతులు కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొంది. సినిమా టిక్కెట్లు ఇచ్చినట్లుగా టోకెన్లు ఇచ్చే సంస్కృతిని తెచ్చింది కూటమి ప్రభుత్వమే అన్న సంగతి గుర్తించాలి. ఇప్పటికే పొలాల్లో ఉండాల్సిన అన్నదాత వ్యవసాయ పనులు మానుకుని ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతూ కడుపు కాలి తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారు. ఇక వారి సహనాన్ని పరీక్షిస్తే ప్రత్యక్ష యుద్ధానికి దిగడానికి కూడా వెనుకాడరు. అన్నదాతకు అండగా ఉండి వారి కష్టాలను తీర్చే వరకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది.

– వంగా గీత, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిఠాపురం

పశువులకు టీకాలు



పశువులకు టీకాలు వేసిన పశువైద్య సిబ్బంది

కొత్తపల్లి: గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గడమే కాకుండా మృతి చెందడం కూడా జరుగుతుందని పశు వైద్యాధికారి హిమజ అన్నారు. స్థానికంగా జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా సోమవారం పశువులకు ఉచిత గాలి కుంటి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని కొత్తపల్లి, నాగులపల్లి, కొమరగిరిలో ఉన్న పశు వైద్య కేంద్రాల పరిధిలో మూడు బృందాలుగా ఏర్పడి టీకాలు వేస్తున్నామన్నారు. మండలంలో ఉన్న 10,350 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆరోగ్యంగా ఉండే నాలుగు నెలల వయసు పైబడిన అన్ని ఆవులు, గేదెలు తదితర పశువులకు ఈ టీకాలు వేస్తున్నామన్నారు. నాలుగు నుంచి 8 నెలలలోపు దూడలకు నెల రోజుల వ్యవధిలో మరోసారి బూస్టర్ డోస్ వేయించుకుంటే వాటిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని పశు రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు ప్రత్యూష, శ్రీమన్నారాయణ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

'కోట'కు చేరిన ఉపాధ్యాయుల జాతా



సామర్లకోటలో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ

సామర్లకోట: ఉపాధ్యాయుల సమస్యలపై తునిలో ప్రారంభమైన జాతా సోమవారం సామర్లకోటకు చేరింది. ఈ జాతాకు యూటీఎఫ్ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మెహర్ కాంప్లెక్స్‌లో యూటీఎఫ్ జెండాను ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ బుర్రా గోపిమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలు, వాటి పరిష్కారానికి, నిధులు విడుదలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి టీవీ చక్రవర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగేష్, సూరిబాబు, జిల్లా నాయకులు కేవీ గిరిదర్ గోపాల్, పీవీవీ సత్యనారాయణ, సీతారామరాజు, గణేష్, సీహెచ్‌వీ రమణ, పట్టణ శాఖ గౌరవ అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, అధ్యక్షుడు గణేష్, కార్యదర్శులు ఎం.నాగేశ్వరరావు, వీరన్న, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు, రైతులకు అండగా ఉంటాం



పిఠాపురం నియోజకవర్గ నేతలతో వంగా గీత ఇతర నాయకులు

నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత

పిఠాపురం: ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి అండగా ఉండి వారి తరుపున పోరాటం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. సోమవారం నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల కంటే పిఠాపురానికి వైఎస్సార్ సీపీ అధిక ప్రాధాన్యమిస్తోందని, రాష్ట్ర స్థాయిలో పార్టీ పదవులు ఎక్కువ పిఠాపురం నేతలకు వచ్చాయన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో పార్టీని మరింత బలపర్చాలన్నారు. రాష్ట్ర స్థాయి పదవుల్లో ఇప్పటికే అనేక మందికి అవకాశం కల్పించగా ప్రస్తుతం ఒరుగంటి చక్రం, ముమ్మిడి శ్రీనివాస్, జ్యోతుల బాబులు, జవ్వాది కృష్ణమాదవరావు తదితరులకు పదవులు లభించడం ఆనందదాయకమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలను, రైతులను మోసం చేస్తోందన్నారు. ఏడాదిన్నర పాలనల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చని ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కూటమి ప్రభుత్వమే అన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను అందరూ తెలుసుకున్నారని, తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారు. వైఎస్సార్ సీపీ వారి అండగా ఉందని భరోసా ప్రజల్లో కలిగిందన్నారు. రానున్న రోజుల్లో చేపట్టబోయే కార్యక్రమాలపై నాయకులతో చర్చించారు. ఈకార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

రైతుల పాట్లు మీకు పట్టవా!

- లెక్కలు మాత్రం చెప్పుకొస్తారు
- సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు



సమావేశంలో యూరియా పంపిణీపై వ్యవసాయ శాఖ అధికారిని నిలదీస్తున్న వైస్ ఎంపీపీ సురేష్ కుమార్

కొత్తపల్లి: గత కొన్ని రోజుల నుంచి గ్రామాల్లో యూరియా కోసం రైతులు సొసైటీల వద్ద పడుతున్న పాట్లు అధికారులు ఏమాత్రం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని, లెక్కల్లో మాత్రం రైతులందరికీ యూరియా అందిస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందని వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్ అధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ కారే సుధా ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న సమస్యలపై అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. నాగులాపల్లి సర్పంచ్ అనిశెట్టి గౌరీ రాజేశ్వరి మాట్లాడుతూ గత 25 రోజులుగా గ్రామ కార్యదర్శి విధులకు హాజరు కావడంలేని, గత మూడు నెలల నుంచి పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వటం లేదన్నారు. తాగు నీరు, వీధి దీపాలు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎంపీడీవో ఒకసారి గ్రామంలోకి వచ్చి సమస్యలు తెలుసుకోవాలన్నారు. కొండెవారం ఎంపీటీసీ సత్తిబాబు మాట్లాడుతూ ఇంద్ర కాలనీలో ఇళ్లపై నుంచి 11 కేవీ విద్యుత్ వైర్ ఉంది, ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యలను గుర్తించాలన్నారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ పశు రైతుల కోసం అనేక పథకాలు ఉన్నా అధికారులు రైతులకు తెలియజేయడంలేదన్నారు. రైతులకు అవగాహన కల్పించవలసిన బాధ్యత వారిదే అన్నారు. ఎంపీపీ కారే సుధ మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారులు ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసి కుమార్, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, తాసిల్దార్ చిన్నా రావు, ఎంపీడీవో ఎ.లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్



పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. ప్రతి వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి తొమ్మిది అర్జీలు అందినట్లు ఆమె తెలిపారు. అనంతరం ఆర్డీఓ శ్రీరమణి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కంచరిందేకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించామని ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ రవిశంకర్, అధికారులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి పూజలు

సామర్లకోట: స్థానిక అతిపూరాతన విష్ణు ఆలయమైన మాండవ్యనారాయణస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీ వైష్ణవాష్టమిని పురస్కరించుకొని ప్రతి ఏడాది ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని మాండవ్యనారాయణస్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణలు చేసి పూజలు చేశారు. ఆలయ పారాయణ కమిటీ మహిళా సభ్యులతోవిష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. పారాయణ చేసిన 100 మంది మహిళలకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఈఓ బిక్కిన వెంకట్రాయ చౌదరి ఆధ్వర్యంలో ఆలయ పండితులు అనంత పద్మనాభాచార్యులు, రవికుమార్, రవికుమార్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం పట్టణ పరిధిలోని కృష్ణుని ఆలయం వద్ద ఊట్టు కొట్టు కార్యక్రమం ఉంటుందని ఆలయ పండితులు తెలిపారు.

పోర్టు స్టీమరేజంట్స్ చైర్మన్‌గా తలారి



తలారి రామచంద్రరావు

సామర్లకోట: కాకినాడ పోర్టు స్టీమరేజంట్స్ అసోసియేషన్ చైర్మన్‌గా సామర్లకోట మండలం వీకే రాయపురం గ్రామానికి చెందిన తలారి రామచంద్రరావు ఎన్నికయ్యారు. తలారి రామచంద్రరావు లయన్స్ క్లబ్ కాకినాడ పుష్కర్ ద్వారా సేవలందిస్తున్నారు. ఆదివారం రాత్రి కాకినాడ పల్లంరాజునగర్‌లోని షిపింగ్ హౌస్ భవనంలో 44వ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు చైర్మన్ తలారి రామచంద్రరావు, వైస్ చైర్మన్‌గా బడే గోవిందరావు, కార్యదర్శిగా కేవీఎస్ సీతారామ్, కోశాధికారిగా ముత్యాల సాయిరాం, సహాయ కార్యదర్శిగా వి.శ్రీనివాసు, ముఖ్య కార్యవర్గ సభ్యులుగా కెప్టెన్ దివాకర్, ఎంవీ శంకర్, వెంకటభగవతి, ఎం.కృష్ణ ఎన్నికయ్యారు. ఈ కమిటీ రెండు సంవత్సరాలు కొనసాగుతుందని కమిటీ నాయకులు తెలిపారు. కాకినాడ పోర్టు నుంచి సరకులు ఎగుమతి, దిగుమతి అయ్యే ఓడల సిబ్బంది, ఓడల యజమానులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా సేవలందిస్తామని నూతన కమిటీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ వీవీ రాఘవులు ముఖ్య అతిథిగా హాజరైనట్లు రామచంద్రరావు తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీల్లో మాధవపట్నం విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన మాధవపట్నం హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

సామర్లకోట: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సామర్లకోట మండలం మాధవపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో బహుమతులు సాధించారు. ఆదివారం కాకినాడ మూడో పోలీసు బెటాలియన్ క్రీడా మైదానంలో పోటీలు జరిగిన విషయం విదితమే. అండర్–14 విభాగం జావెలిన్ త్రోలో రామవరపు పవన్ ప్రథమ స్థానం, గణేష్ పెంకె హిమవర్ధిని ద్వితీయ స్థానం సాధించారు ట్రైఅథ్లెలోన్ (సైకిలింగ్, రన్నింగ్, స్విమింగ్) సీ విభాగంలో బొంగా సతీష్‌కుమార్ ప్రథమ, అనుసూరి హేమంత్ తృతీయ స్థానాలను సాధించారు. వీరు ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల పిజికల్ డైరెక్టరు గోవింద్ తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

30న ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ యూనిట్ ఎన్నికలు

సామర్లకోట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని ఏపీఎన్జీఓల సంఘ సామర్లకోట తాలూకా యూనిట్ ఎన్నికలు ఈనెల 30వ తేదీన జరుగుతాయని ఎన్నికల అధికారి బీఆర్‌వీ చౌదరి సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. యూనిట్ కాల పరిమితి ముగిసిన సందర్భంగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభించినట్టు తెలిపారు. ప్రస్తుత ఇన్‌చార్జి అధ్యక్షుడిగా జిల్లా ఉపాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ ఎన్నికలకు కరప యూనిట్ అధ్యక్షుడు బీఆర్‌వీ చౌదరి, అసిస్టెంట్ ఎన్నికల అధికరిగా కరప యూనిట్ కార్యదర్శి కె.కేశవరావు, ఎన్నికల పర్యవేక్షణగా ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు వ్యవహరిస్తారని తిలిపారు. ఈ మేరకు ఓటర్ల నమోదు ఈనెల 16 తేదీ సాయంత్రం 4.30 వరకు ఉంటుందన్నారు. 23వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. ఎన్నిక 30వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ పోలింగ్ లయన్స్ క్లబ్ సామర్లకోటలో జరుగుతాయన్నారు.

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

సామర్లకోట: మండల మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం మంగళవారం ఉదయం స్థానిక గాంధీ చౌక్‌లోని రైతు భవనంలో జరుగుతుందని మార్కెట్ కమిటీ కార్యదర్శి నాగలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్నరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబులు పాల్గొంటారన్నారు.

పంట నమోదుతోనే రైతులకు గుర్తింపు

సామర్లకోట: పంట నమోదుతోనే రైతులకు గుర్తింపు ఉంటుందని సివిల్ సప్లయ్స్ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రైతు సేవా కేంద్రం టెక్నికల్ అసిస్టెంట్లు, వీఏఏలు, హెల్పర్‌లకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహణపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు పంట నమోదు చేయించుకుంటే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడానికి వీలు కలుగుతుందని చెప్పారు. అదే విధంగా వెహికల్ రిజిస్ట్రేషన్, కూన్ జనరేషన్, జీఎల్‌టీ, ట్రక్ షీట్ జనరేషన్ విధి విధానాలను సిబ్బందికి వివరించారు. సీవిల్ సప్లయ్ టెక్నికల్ అసిస్టెంట్ శ్రావణి మాట్లాడుతూ 2025కు గాను కనీస మద్దతు ధర ఒక క్వింటాల్‌కు రూ.2,369 నిర్ణయించామన్నారు. దీనిని కోతలు ప్రారంభించే ముందు రైతులకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతి రైతు ధాన్యాన్ని రైతు సేవా కేంద్రం ద్వారా విక్రయించేలా అవగాహన పెంచాలని సూచించా రు. ధాన్యం 17 శాతం కంటే తక్కువగా తేమ శాతం ఉండాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వి.మురళీధర్, ఎఈఓలు శాంతికమణ, రూప తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం సేవలు మరువలేనివి

సామర్లకోట: దేశ ఇంజినీరింగ్ రంగంలో ఎనలేని సేవలు చేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు ఎన్నటి మరువలేమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. విశ్వేశ్వరయ్య 164వ జయంతిని పురస్కరించుకొని సోమవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం విశ్వేశ్వరయ్య పుట్టిన రోజును ఇంజినీర్స్ డేగా గుర్తించిందని తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక రంగంలో జరుగుతున్న మార్పులను గమనించడానికి ఆయన బీజం వేశారన్నారు. ప్రతి విద్యార్థి విశ్వేశ్వరయ్య జీవిత చరిత్రను గమనిస్తూ జ్ఞానాన్ని మెరుగు పర్చుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీఆర్ఎస్ శివ కుమార్, టీఎస్ పద్మావతి, పి.నిర్మల పాల్గొన్నారు.

ఏలేరుపై రైతులకు స్పష్టత ఏది..?

- గృహ నిర్మాణాల్లోనూ అధికారుల నిర్లక్ష్యం
- చేసిన పనులకు బిల్లులు విడుదలలో జాప్యం!
- మండల సమావేశంలో అధికారులను నిలదీసిన ప్రజా ప్రతినిధులు
- సమష్టి కృషితోనే మండల అభివృద్ధి
- ఎమ్మెల్యే చిన రాజప్ప



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప

పెద్దాపురం: ఏలేరు నీటి విడుదల, ఆధునీకరణ పనుల్లో అధికారులకు స్పష్టత లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. గృహ నిర్మాణాల్లోనూ ఆయా శాఖాధికారుల వైఫల్యం స్పష్టంగా కనపడుతుందంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పెద్దాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మర్లావ, తిరుపతి గ్రామ సర్పంచులు తోట రామకృష్ణ, మొయిళ్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ మండల సమావేశానికి పూర్తి స్థాయిలో అధికారులు హాజరుకాక పోవడమేమిటని ప్రశ్నించారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ, ఇరిగేషన్ అధికారులు తమ శాఖల తీరుపై స్పష్టత కలిగి ఉండాలని, ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూ ఎస్, ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రావాల్సిన బిల్లులను సత్వరమే విడుదల చేయాలన్నారు. కొండపల్లి ఎంపీటీసీ పోకనాటి నాగలక్ష్మి మాట్లాడుతూ మెట్టలోని పామాయిల్ రైతాంగానికి ఇవ్వాల్సిన సబ్సిడీ సకాలంలో విడుదల చేయడం లేదన్నారు. రైతులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం పలు సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య తీవ్ర చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే మండల అభివృద్ధి సాధ్య పడుతుందన్నారు. అనంతరం డీఎల్‌డీఓగా పదోన్నతిపై విశాఖ జిల్లాకు వెళుతున్న ఎంపీడీఓ శ్రీలలితను ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె మంగాలక్ష్మి, సర్పంచ్‌లు కసపర్తి చీమదొర, శ్రీనివాస్, శేఖర్, ఎంపీటీసీలు నల్లల సూర్యకుమారి, నాగలక్ష్మి, మండల కో–ఆప్షన్ సభ్యులు శేషకుమారి, ఆయా శాఖల అధికారులు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.